క్లుప్తంగా

నేడు వాహనాల వేలం

బైరెడ్డిపల్లి: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు వివిధ కేసుల్లో పట్టుబడిన 3 ద్విచక్రవాహనాలు, ఒక కారును వేలం వేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటనరసింహులు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల వారు రూ.వెయ్యి చెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు.

భగవద్గీత పఠనంతో విశ్వశాంతి


భగవద్గీతపై అవగాహన కల్పిస్తున్న సేవాసమితి సభ్యులు

బైరెడ్డిపల్లి: భగవద్గీత పఠనంతోనే విశ్వశాంతి సాధ్యమని త్రైతసిద్ధాంత ప్రబోధ సేవాసమితి అధ్యక్షుడు అశోక్‌బాబు అన్నారు. మండలంలోని కమ్మనపల్లెలో ఆదివారం భగవద్గీతపై అవగాహన కల్పిస్తూ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో మానవులు తృప్తి లేని జీవితం సాగిస్తున్నారని, గీతా జ్ఞానం ద్వారా కర్మ విధానం తెలుసుకుని మోక్షం పొందుతారన్నారు. కార్యక్రమంలో వి.కోట, బంగారుపాళ్యం, పలమనేరు సేవాసమితి అధ్యక్షులు బాలాజీ, భాస్కర్, సభ్యులు హరిప్రసాద్, గౌతమ్‌కృష్ణ, ఝాన్సీ, వాణిశ్రీ పాల్గొన్నారు.

నేడు గుండెజబ్బులకు వైద్యశిబిరం

పుంగనూరు: పట్టణంలోని లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం గుండెజబ్బు కలిగిన వారికి ఉచిత వైద్యసేవలు అందించనున్నట్లు లయన్స్‌క్లబ్ ప్రాజెక్టు మేనేజర్ డాక్టర్ శివ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ స్థానిక బీఎంఎస్ క్లబ్‌లో వైద్యశిబిరం ఉదయం 9 గంటలకు ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. బెంగళూరుకు చెందిన నారాయణ హృదయాలయ వారిచే పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. గుండెజబ్బులు కలిగిన వారు శిబిరంలో పరీక్షలు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

సచివాలయ కన్వీనర్ల అధ్యక్షుడిగా వినోద్‌రెడ్డి



గంగవరం: మండల గ్రామ సచివాలయ కన్వీనర్ల అధ్యక్షుడిగా మేలుమాయి గ్రామానికి చెందిన వినోద్‌రెడ్డి ఎంపికయ్యారు. ఈ మేరకు మండల సచివాలయాల కన్వీనర్‌గా అతన్ని ఎంపిక చేసినట్లు పార్టీ కన్వీనర్ మోహన్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రహ్లాద, నాయకులు చంద్రప్ప, గిరిరాజారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో ఎమ్మెల్యే వెంకటేగౌడ ఆధ్వర్యంలో జరిగిన కన్వీనర్ల ఎంపికలో గంగవరం మండలం నుంచి వినోద్‌రెడ్డిని ఎంపిక చేసినట్లు చెప్పారు. పార్టీ బలోపేతం కోసం అహర్నిశలు శ్రమిస్తానని ఆయన తెలిపారు.

ఘనంగా త్యాగరాజ ఆరాధనోత్సవం


కీర్తనలను ఆలపిస్తున్న గాయకులు

పలమనేరు: పట్టణ సమీపంలోని కళామందిరంలో త్యాగరాజ ఆరాధనోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. జాయినింగ్ ద డాట్స్ సంస్థ ఆధ్వర్యంలో త్యాగరాజ కీర్తనలను ఆలపించి శ్రోతలను అలరించారు. ఇందులో గాత్రం సాయితేజస్, చంద్రశేఖర్, మృదంగం నాగరాజు, ఘటం సుమనా చంద్రశేఖర్, వయోలిన్ అర్జున్ దినకర్ ప్రదర్శించారు. కార్యక్రమంలో తులసీనాథం నాయుడు, పుష్ప, లక్ష్మీకాంత్, మాధవరెడ్డి, శివశంకర్, సీతారామయ్య పాల్గొన్నారు.

దస్తగిరికి నివాళి


దస్తగిరి భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

పలమనేరు: పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ యూత్ నాయకుడు ముజ్జు తండ్రి షేక్ దస్తగిరి భౌతికకాయానికి స్థానిక ఎమ్మెల్యే వెంకటేగౌడ నాయకులతో కలసి ఆదివారం నివాళులర్పించారు. ఆదివారం ముజ్జు ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి ఓదార్చారు. ఇందులో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి మురళీకృష్ణ, కన్వీనర్ జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు

- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి
- విస్తృతంగా గ్రామాల్లో పర్యటించిన మంత్రి


చిచ్చిలివారిపల్లెలో మంత్రి పెద్దిరెడ్డికి హారతులిస్తున్న మహిళలు

పులిచెర్ల(కల్లూరు): ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాల ద్వారా ప్రతి కుటుంబాన్ని ఆదుకోవడం జరిగిందని రాష్ట్ర అటవీ, విద్యుత్, పర్యావరణ, భూగర్భగనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. పల్లెబాట కార్యక్రమంలో భాగంగా మూడోరోజు ఆయన మండలంలోని 8 పంచాయతీల్లో ఉన్న 43 గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. పర్యటనకు విచ్చేసిన మంత్రికి ప్రతి గ్రామంలో అడుగడుగునా మహిళలు హారతులు ఇచ్చి ఘనంగా స్వాగతం పలికారు. ప్రతి ఒక్కరికీ ఆయన అభివాదం చేస్తూ ఆప్యాయంగా పలకించారు. సమస్యలు ఉంటే తెలియజేస్తే వెంటనే పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఏ సమస్య వచ్చినా తనను ఎప్పుడైనా కలవవచ్చని వారికి తెలియజేశారు.

అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం..

మండలంలోని చిచ్చిలివారిపల్లె, రేణుమాకులపల్లె, మంగళంపేట, పుచ్చలవారిపల్లె, గడ్డంవారిపల్లెల్లో నూతనంగా నిర్మించిన ఆర్‌ఓ ప్లాంట్లను, మంగళంపేట, నన్నూరువారిపల్లెల్లో అంగన్‌వాడీ కేంద్రాలను మంత్రి పెద్దిరెడ్డి ప్రారంభించారు. అలాగే ఆయన మండలంలోని 106 దళితవాడలోని డా.బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. గడ్డంవారిపల్లె పంచాయతీ పగడాలవారిపల్లెలో ఏర్పాటు చేసిన మంత్రి పెద్దిరెడ్డి తండ్రి దివంగత పెద్దిరెడ్డి లక్ష్మంరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. టీటీడీ పాలక మండలి సభ్యులు పోకల అశోక్‌కుమార్, ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి మంత్రి పీఏ మునితుకారాం, రెడ్డీశ్వరరెడ్డి, వల్లివేడు రాజారెడ్డి, నాగరాజ ప్రసాద్, ముర్వత్ బాషా, ప్రసాద్, విజయభాస్కరరెడ్డి, భాస్కరరెడ్డి, చెంచురెడ్డి, లోకేశ్వరరెడ్డి, రాయల్‌మోహన్, జంపాల రాజేష్, రాశి ప్రసాద్, భార్గవి, రమణారెడ్డి, పృథ్వీ, సర్పంచ్‌లు సులోచన, మధు, మునిరత్నం, వాసుదేవరెడ్డి, అనిత, అమరావతి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



తండ్రి దివంగత లక్ష్మంరెడ్డికి నివాళులర్పిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, చిచ్చిలివారిపల్లెలో మహిళలకు అభివాదం చేస్తున్న మంత్రి

పేదలకు బాసట.. సంక్షేమ బావుటా


లబ్ధిదారులకు సంక్షేమ బావుటా బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

- గత ప్రభుత్వంలో ఆ పార్టీ వారికే మాత్రమే పథకాలు
- ఈ ప్రభుత్వంలో లబ్ధిదారుల చెంతకే సంక్షేమ ఫలాలు
- పథకాలకే వన్నె తెచ్చిన ఘనత సీఎం జగనన్నదే
- ఎమ్మెల్యే వెంకటేగౌడ

గంగవరం: ×పేదలకు అందజేస్తున్న సంక్షేమ బావుటా బుక్‌లెట్‌ను చూస్తే తెలుస్తోంది.. గడిచిన మూడున్నరేళ్ల మా వైఎస్సార్‌సీపీ పాలనలో ఒక్కో ఇంటికి లక్షల్లో పథకాల ద్వారా లబ్ధి చేకూరిందని₹ ఎమ్మెల్యే వెంకటేగౌడ అన్నారు. ఆదివారం మండలంలోని మేలుమాయి పంచాయతీ మోతుకులపల్లి, శివపురం, ముబ్బువారిపేట గ్రామాల్లో జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యేకి నాయకులు, ప్రజలు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి సంక్షేమ బావుటా పత్రాలను అందజేశారు. ప్రజాసమస్యలు తెలుసుకుని వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమం అంటే జగన్.. జగన్ అంటేనే సంక్షేమం అని కొనియాడారు. ఎందుకంటే గత టీడీపీ ప్రభుత్వంలో వందల హామీలు ఇచ్చిన బాబు ఐదేళ్ల పాలనలో ఒక్క పథకమైనా నెరవేర్చారా అంటూ విమర్శించారు. 2014 ఎన్నికల ముందు ప్రకటించిన టీడీపీ మేనిఫెస్టోని పక్కన పడేసి పథకాలను రూపుమాపిన ఘనుడు చంద్రబాబు కాదా అంటూ మండిపడ్డారు. ఈ ప్రభుత్వం ఏర్పడిన కొన్నాళ్లకే మేనిఫెస్టోలో నవరత్నాల పథకాలు పూర్తిగా అమలు పరిచి సంక్షేమ పథకాలకు వన్నె తెచ్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వెల్లడించారు. చంద్రబాబు హయాంలో కేవలం నాయకుల జేబుల్లో మాత్రమే పరిపాలన సాగిందని విమర్శించారు. అలాకాకుండా ఇది ప్రజా పరిపాలన అన్నట్టుగా ప్రజల వద్దకే పాలన ప్రవేశపెట్టి ప్రభుత్వానికే అర్థం తీసుకొచ్చిన ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందన్నారు. ఇంతటి గొప్ప పాలనలో రాష్ట్ర ప్రజలు సంతోషంగా ఉండడం చూసి ఓర్వలేని బ్యాండ్ బాబు బ్యాచ్ ప్రభుత్వంపై అనుక్షణం బురదజల్లే వ్యాఖ్యలు చేయడం తప్ప విమర్శించేందుకు ఇంకేం లేదని మీరెన్ని కుయుక్తులు పన్నినా టీడీపీని ప్రజలు నమ్మే ప్రసక్తే లేదన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అసెంబ్లీ స్థానాలు క్లీన్ స్వీప్ చేయడం ఖాయమన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ మోహన్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రహ్లాద, ఎంపీపీ వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యురాలు పార్వతి, సర్పంచ్ చందనపవన్, ఎంపీటీసీ శ్రీధర్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు గిరిరాజారెడ్డి, పలమనేరు ఏరియా ఆస్పత్రి చైర్మన్ చెంగారెడ్డి, నాయకులు చంద్రప్ప, శ్రీరాములురెడ్డి, చలపతిరెడ్డి, వినోద్‌రెడ్డి, రాధాకృష్ణ, పటాభిరామయ్య, రాఘవ, నితీష్, తహసీల్దార్ మురళి, ఎంపీడీఓ శివప్రసాద్, పలు శాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లు, పాల్గొన్నారు.

నేడు కలగటూరు సచివాలయ పరిధిలో..

గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం నుంచి కలగటూరు గ్రామ సచివాలయ పరిధిలో రెండురోజుల పాటు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ తెలిపారు. అందులో భాగంగా నేడు కలగటూరు, అరసనపల్లి ఎస్సీ కాలనీలో కార్యక్రమం జరుగుతుందన్నారు. మండలంలోని అన్నిశాఖల అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరూ తప్పక హాజరు కావాలని తెలిపారు.

స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయం


మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

- జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

పలమనేరు: స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయమని జెడ్పీ చైర్మన్ వాసు అలియాస్ శ్రీనివాసులు అన్నారు. పలమనేరు పట్టణంలోని లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో భోగనాథ్‌గుప్త జ్ఞాపకార్థం కుప్పం పీఈఎస్ వైద్యులచే ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ఆరోగ్యంపై పలు స్వచ్ఛంద సంస్థలు ఎన్నో సేవా కార్యక్రమాలను చేపడుతున్నాయని తెలిపారు. సమాజానికి ఉపయోగపడే పనులను చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా శిబిరానికి 124 మంది హాజరు కాగా వీరిలో 12 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేసినట్టు వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో కార్యక్రమ దాత సుధీర్‌కుమార్, లయన్స్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు రవి, చంద్రయ్యశెట్టి, పూగోంది తదితరులు పాల్గొన్నారు.

కేసీ ఆస్పత్రిలో అరుదైన శస్త్రచికిత్స


చికిత్స చేస్తున్న వైద్యులు

కుప్పంరూరల్: కుప్పం పట్టణంలో కేసీ ఆస్పత్రి వైద్యులు అరుదైన సర్జరీ చేశారు. మల్లానూరు గ్రామానికి చెందిన 50 ఏళ్ల కలిగిన ఓ వ్యక్తి గత కొంత కాలంగా వాస్కులర్ పెయిన్‌తో బాధ పడుతున్నాడు. ఇతనికి కేసీ ఆస్పత్రులు వైద్యులు మంజునాథ్, బాలాజీ శస్త్ర చికిత్స చేసి కాళ్లలో ఆగిపోయిన రక్తప్రసరణను పునరుద్ధరించారు. రూ.లక్షకు పైగా అయ్యే ఈ శస్త్రచికిత్సను అతి తక్కువ ధరకే చేయడంపై రోగి కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.

నేడు ఎరికలపల్లెలో శివకోటి

చౌడేపల్లె: మండలంలోని చారాల పంచాయతీ ఎరికలపల్లెలో సోమవారం గ్రామస్తుల ఆధ్వర్యంలో శివకోటి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 24 గంటలపాటు నిర్విరామంగా శివకోటి ఆలపిస్తారు. ఈ సందర్భంగా ఎరికలపల్లెలో అన్నదానం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని గ్రామస్తులు పేర్కొన్నారు.

మోడల్ పరీక్షకు స్పందన


పుంగనూరు: పరీక్ష రాస్తున్న విద్యార్థులు

పుంగనూరు: ప్రభుత్వం ఫిబ్రవరి 5వ తేదీన ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలను నిర్వహించనుంది. ఈ పరీక్షలకు సంబంధించి నమూనా పరీక్షలను ఆదివారం స్థానిక బసవరాజ హైస్కూల్‌లో నిర్వహించారు. చిత్తూరు జిల్లా స్కూల్ అసిస్టెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు మునిరాజ, సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో 8వ తరగతి విద్యార్థులు సుమారు 500 మంది వివిధ మండలాల నుంచి హాజరయ్యారు. ఈ పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారికి సంఘం తరఫున నగదు బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలకు ఈ నమూనా పరీక్షలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్మికుల కడుపు కొడుతున్న కేంద్రం

తిరుపతి కల్చరల్: కేంద్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలకు తూట్లు పొడుస్తూ కార్మికుల కడుపు కొడుతోందని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేశు ఆరోపించారు. ఏపీ హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మూడవ మహాసభలు ఆదివారం తిరుపతిలో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కార్మికులు బైరాగిపట్టెడ నుంచి కృష్ణాపురం ఠాణా వరకు ప్రదర్శన చేపట్టారు. అనంతరం అక్కడ బహిరంగ సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ లక్షలాది మంది పనిచేస్తున్న అసంఘటిత రంగానికి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. కార్మికులకు పీఎఫ్, ఈఎస్‌ఐ వంటి సౌకర్యాలు కల్పించాలన్నారు. రాష్ట్రంలో అసంఘటిత రంగంలో పనిచేస్తున్న 1.78 కోట్ల మంది కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సమస్యల సాధన కోసం సమరశీల పోరాటాలు సాగించాలని పిలుపునిచ్చారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పి.హరినాథరెడ్డి మాట్లాడుతూ రూ.లక్షల కోట్లు ఎగ్గొట్టి విదేశాలకు పారిపోయే వారికి కేంద్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కుమార్‌రెడ్డి, రాధాక్రిష్ణ, రాజా, ఎన్‌డీ.రవి, యూనియన్ రాష్ట్ర నేతలు అంజిబాబు, రమణ పాల్గొన్నారు.

రూ.35 లక్షలతో తారురోడ్లకు మరమ్మతులు


రొంపిచెర్ల మండలంలో జరుగుతున్న రోడ్డులో జరుగుతున్న మరమ్మతులు

రొంపిచెర్ల: మండలంలో దెబ్బతిన్న తారు రోడ్లను రూ.35 లక్షలతో మరమ్మతులు చేపట్టినట్లు ఆర్‌అండ్‌బీ ఏఈ అజిత్‌రెడ్డి ఆదివారం తెలిపారు. పెద్దమల్లెల–ఎర్రావారిపాళ్యెం రోడ్డుకు రూ.20 లక్షలు, వంకిరెడ్డిగారిపల్లె రోడ్డుకు రూ.10 లక్షలు, బోరెడ్డిగారిపల్లె రోడ్డుకు రూ.5 లక్షలతో మరమ్మతులు చేస్తున్నామని తెలిపారు. మండలంలో నాలుగు నెలల క్రితం కురిసిన భారీ వర్షాలకు తారు రోడ్లు గుంతలు పడ్డాయన్నారు. దీంతో రోడ్లకు మరమ్మతులు చేయాలని ప్రజలు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లారని తెలిపారు. దీంతో మంత్రి ప్రభుత్వం నుంచి రూ.35 లక్షల నిధులను మంజూరు చేయించారని చెప్పారు. రోడ్డు మరమ్మతు పనులకు టెండర్లు నిర్వహించి పనులను చేపట్టినట్లు ఏఈ తెలిపారు. రోడ్ల మరమ్మతులపై స్థానిక ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పుస్తక పఠనంతోనే విజ్ఞానం


త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రతులను పంచుతున్న ప్రతినిధులు

కుప్పంరూరల్: పుస్తకాల పఠనంతోనే విజ్ఞానం సాధ్యమని ప్రబోధానంద సేవాసమితి ప్రతినిధి కృష్ణ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని కమతమూరు గ్రామంలో ప్రబోధానంద రచించిన ఆధ్యాత్మిక పుస్తకాలు, త్రైతసిద్ధాంత భగవద్గీత గురించి గ్రామస్తులకు వివరించారు. అదేవిధంగా కొంత మంది ప్రబోధానంద రచించిన పుస్తకాలు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ జీవాత్మ, ఆత్మ, పరమాత్మలను వివరించడమే త్రైతసిద్ధాంత ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో నాగరాజు, మంజునాథ్‌శెట్టి, శివ, శరవణ, రాధ, ఇందు తదితరులు ఉన్నారు.

ఎన్‌ఎంఎంఎస్ మాదిరి పరీక్షకు స్పందన


ఎన్‌ఎంఎంఎస్ మాదిరి పరీక్షకు హాజరైన విద్యార్థులు

పలమనేరు: పట్టణంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ఆదివారం స్కూల్ అసిస్టెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్‌ఎంఎంఎస్(నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ మాదిరి పరీక్షకు మంచి స్పందన లభించింది. మండలంలోని ఎనిమిదో తరగతి చదువుతున్న పిల్లలు పెద్దసంఖ్యలో ఈ పరీక్షకు హాజరయ్యారు. ఏటా మాదిరి పరీక్ష ద్వారా పిల్లలను సమాయత్తం చేస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు మునెప్ప మొదలి, విజయశేఖర్ పాల్గొన్నారు.

రెడ్డిచెన్నప్ప నాయుడు మృతి తీరని లోటు


రెడ్డి చెన్నప్ప నాయుడు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి

రొంపిచెర్ల: వైఎస్సార్‌సీపీ నాయకుడు రెడ్డి చెన్నప్ప నాయుడు మృతి పార్టీకి తీరని లోటని రాష్ట్ర అటవీశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మండలంలోని దద్దాలవారిపల్లెలో జరిగిన రెడ్డి చిన్నప్ప నాయుడు కర్మక్రియలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రెడ్డి చెన్నప్ప నాయుడు రాజకీయాల్లో తనకు చాలా అండగా ఉన్నారని తెలిపారు. ఆయన లేకపోవడం తనకు, పార్టీకి పెద్ద లోటన్నారు. మృతుని కటుంబానికి తాను అండగా ఉంటానని భరోసా కల్పించారు. అనంతరం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రెడ్డీశ్వర్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి సలీం బాషా, సర్పంచ్‌లు నాగిరెడ్డి, ఇబ్రహీంఖాన్, నాయకులు సురేంద్రనాయుడు, కరీముల్లా, లక్ష్మయ్య, చిన్న నాగరాజ తదితరులు పాల్గొన్నారు.

13 మంది విద్యార్థులకు అస్వస్థత


పందిళ్లపల్లెలో విద్యార్థులకు వైద్య సేవలందిస్తున్న వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది

చౌడేపల్లె: మండలంలోని పందిళ్లపల్లె ప్రాథమిక పాఠశాల, మేకలచిన్నేపల్లె ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న పందిళ్లపల్లెకు చెందిన 13 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన సంఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. డాక్టర్ పవన్‌కుమార్ ఆదేశాల మేరకు సీహెచ్‌ఓ లిఖిత, ఏఎన్‌ఎం గీత ఆధ్వర్యంలో పందిళ్లపల్లెలో వైద్యశిబిరం ఏర్పాటుచేశారు. పందిళ్లపల్లె ప్రాథమిక పాఠశాలకు చెందిన కె.వెన్నెల(08), నందిని(06), యశ్విని(10), కల్యాణ్(10), జశ్వంత్ (9), వరుణ్‌తేజ్(08), తేజశ్రీ(10), మేకలచిన్నేపల్లె ఉన్నత పాఠశాలకు చెందిన అనుష్క(12), టి.పవిత్ర(12), టి.గంగాధర (14), బి.లహరిక (14), ఎస్.హర్షవర్ధన్ (12), బి.అలక్‌నంద(11) ఉన్నారు. ఈ విద్యార్థులకు వైద్యసిబ్బంది వైద్యం అందించారు. మధ్యాహ్న భోజనం నాణ్యతాలోపం కారణంగా అస్వస్థతకు లోనైనట్లు వైద్యులు తెలిపారు. ఇక్కడ మధ్యాహ్న భోజనం నాణ్యతా ప్రమాణాలను పాటించడం లేదని తల్లిదండ్రులు ఆరోపించారు. ఈ విషయమై ఎంఈఓ కేశవరెడ్డిని వివరణ కోరగా విచారించి సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటామన్నారు.

హంస వాహనంపై కాశీ విశ్వేశ్వరుడు



పలమనేరు: పట్టణంలోని కాశీ విశ్వేశ్వరుని వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి వారు హంసవాహనంపై ఆదివారం భక్తులకు కనువిందు చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం అభిషేకం, అంకురార్పణ, కలశస్థాపన, ధ్వజారోహణం, అగ్నిప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆలయ కమిటీ చైర్మన్‌తో పాటు సభ్యులు, ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఒత్తిడికి చెక్


జేశాప్ జిల్లా నూతన కమిటీ సభ్యులు

తిరుపతి తుడా: జర్నలిస్టులు ఒత్తిడిని అధిగమించాలంటే క్రీడలు ఎంతో అవసరమని ఏసీఏ చిత్తూరు జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షుడు క్రికెట్ విజయ కుమార్ తెలిపారు. కపిలతీర్థం రోడ్డులోని కేబీఆర్ సమావేశ మందిరంలో ఆదివారం జర్నలిస్ట్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (జేశాప్) జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జేశాప్ వ్యవస్థాపకుడు, దివంగత సోడిశెట్టి దుర్గారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా అధ్యక్షుడిగా పులిగోరు శ్రీనివాసులు, కార్యదర్శిగా నెల్లూరు శ్రీనివాసులు, కోశాధికారిగా మంగళం సుబ్రమణ్యం, ఉపాధ్యక్షులుగా దుగ్గాణి ప్రసాద్, ఎన్.ప్రసాద్, ఘట్టమనేని శ్రీనివాసులు, సంయుక్త కార్యదర్శిగా నల్లబోతుల ప్రసాద్, భూమిరెడ్డి నరేష్‌రెడ్డి, అర్ధమాల కామేష్, షేక్ రిహాన్, కార్యవర్గ సభ్యులుగా ప్రతాప్, తులసీరామ్, మునికృష్ణారెడ్డి, అమర్నాథ్, చల్లా విజయ్ కుమార్, మునిశేఖర్, లోకేష్, భాస్కర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విజయ్‌కుమార్ మాట్లాడుతూ నిత్యం వార్తల సేకరణలో నిమగ్నమయ్యే జర్నలిస్టులు తమ వ్యక్తిగత ఆరోగ్యంపైనా దృష్టి సారించాలన్నారు. ప్రముఖ సాహితీ కళారంగ వ్యవస్థాపకుడు కొత్తపల్లి మునిరత్నం మాట్లాడుతూ సమాజ శ్రేయస్సు కోసం పరితపించే జర్నలిస్టులు సంఘంగా ఏర్పడి క్రీడలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్ కార్యదర్శి పి.బాలచంద్ర మాట్లాడుతూ తిరుపతి జిల్లా జర్నలిస్టులు రాష్ట్ర స్థాయి క్రికెట్‌లో రాణిస్తూ పతకాలు సాధిస్తుండడం అభినందనీయమన్నారు. ప్రెస్‌క్లబ్ ద్వారా సంపూర్ణ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రత్నాకర్, ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్, ఉపాధ్యక్షులు రామకృష్ణ రాజు, వెంకటరెడ్డి, రాష్ట్ర సలహాదారు శ్రీనాథ్ రెడ్డి, కార్యదర్శి శివశంకరయ్య, ఉప కార్యదర్శి మోడియం ప్రసాద్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

జమున వ్యక్తిత్వం అందరికీ ఆదర్శం



తిరుపతి కల్చరల్: సమాజ చైతన్యానికి సినిమా అత్యుత్తమమైన సాధనమని, ఉత్తమ నటిగా రాణించిన జమున వ్యక్తిత్వం సినిమా రంగానికి ఆదర్శం కావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పి.హరినాథరెడ్డి తెలిపారు. ఏపీ ప్రజానాట్యమండలి జిల్లా సమితి ఆధ్వర్యంలో ఆదివారం సీపీఐ కార్యాలయంలో సినీ నటి జమున చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ జమున ప్రజానాట్య మండలి వ్యవస్థాపకులలో ఒకరైన గరికపాటి రాజారావు సహకారంతో సినిమా రంగానికి వచ్చారని తెలిపారు. అనేక ఒడిదుడుకులు వచ్చినా తన వ్యక్తిత్వాన్ని దిగజార్చుకోకుండా మొక్కవోని ధైర్యంతో అందరికీ ఆదర్శవంతంగా ఉండేలా జీవితాన్ని కొనసాగించారని తెలిపారు. ఆమె మృతి సినిమా రంగానికి తీరని లోటని తెలిపారు. ఏపీ ప్రజానాట్య మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెంచలయ్య, ఉపాధ్యక్షుడు గుర్రప్ప, జిల్లా కార్యదర్శి నాగరాజు, ఏఐటీయూసీ నేత వెంకటసుబ్బయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కుమార్‌రెడ్డి, రాధాక్రిష్ణ పాల్గొన్నారు.